క్లుప్తంగా

యాదవ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



కాటారం : అఖిల భారత యాదవ సంఘం జాదారావుపేట గ్రామ నూతన కమిటీని బుధవారం డివిజన్ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆత్మకూరి పెద్దకొంరయ్య యాదవ్, అధ్యక్షుడిగా ఆత్మకూరి కుమార్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా సంపత్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా పర్శవేని మహేశ్‌యాదవ్, కోశాధికారిగా పర్శవేని శేఖర్‌యాదవ్, సహకార్యదర్శిగా పోషమల్లు యాదవ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డివిజన్ అడ్‌హక్ కమిటీ సభ్యులు గద్దం చంద్రయ్య యాదవ్, అబ్బినవేని ఐలయ్యయాదవ్, గడవేన దేవేందర్ యాదవ్, మొగిలి రాజ్‌కుమార్ యాదవ్, తొట్ల శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

పలిమెల : ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మహాదేవ్‌పూర్ నుంచి లక్ష్మీపురం వైపు ఆర్టీసి బస్సు వస్తుండగా లెంకలగడ్డ వద్ద విధులు ముగించుకొని పలిమెల రేంజ్ పరిధిలోని సర్వాయిపేట సెక్షన్ ఆఫీసర్ మిన్హాజున్ అమీన్‌కు బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఎఫ్‌ఎస్‌ఓ మిన్హాజున్‌కు స్వల్ప గాయాలు కాగా వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ విషయంపై స్థానిక ఎస్సైని వివరణ కోరగా ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ ఈ ఘటనపై పిటిషన్ ఇచ్చినట్లు తెలిపారు. విచారణ చేపడుతున్నామని తెలిపారు.

ఆర్థిక సాయం



టేకుమట్ల: మండల కేంద్రానికి చెందిన వేమ రాజు బుధవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ మండల నాయకులు వంగ నరేశ్ రూ.2వేల ఆర్థిక సాయాన్ని అందించి భరోసా కల్పించారు. ఆయన వెంట నాయకులు రేనుకుంట్ల శ్రీధర్, తుమ్మల నాగరాజు, ఎలవేని రాజు, శెట్టి రాజేందర్, తిప్పరవేని రాజయ్య, పెరుమాండ్ల రాజు, యుగేందర్, తదితరులు ఉన్నారు.

ఉచిత డీటీపీ శిక్షణ ప్రారంభం



భూపాలపల్లి అర్బన్ : సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత టీడీపీ శిక్షణ కోర్సులను బుధవారం ప్రారంభించారు. ఐటీ మాస్టర్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కోర్సులను నేర్చుకొని నైపుణ్యతను పెంపొందించుకొని స్వయం ఉపాధి పొందే విధంగా తయారుకావాలని జీఎం సూచించారు. కార్యక్రమంలో అధికారులు మారుతి, శ్రావణ్‌కుమార్, సేవా కార్యదర్శి లక్ష్మి, కోఆర్డినేటర్ ప్రవీణ్, గుర్తింపు సంఘం నాయకులు విజేందర్, రాజేందర్‌లు పాల్గొన్నారు.

మహిళా సంఘాల్లో చేరాలి

మొగుళ్లపల్లి : మహిళలందరూ మహిళా సంఘాల్లో చేరండని ఏపీఎం రవివర్మ కోరారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ సంబురాల్లో భాగంగా మహిళలను సంఘాల్లోకి ఆహ్వానిస్తూ మండల కేంద్రంలోని వెలుగు మండల సమైక్య కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ మహిళలందరూ సంఘాల్లో చేరి ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి నుంచి వడ్డీలేని రుణాలు, సీఐఎఫ్ రుణాలు, ప్రమాద బీమా, తదితర సదుపాయాలను పొందాలని తెలిపారు. మండల సమైక్య అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి శిరీష, సీసీలు బత్తిని శ్రీనివాస్, బాబురావు, పాల్గొన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు

మొగుళ్లపల్లి: వరి కోసిన తర్వాత మిగిలి ఉన్న కొయ్యలను కాల్చొద్దని మండల వ్యవసాయ అధికారి సురేందర్‌రెడ్డి రైతులను కోరారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణం కాలుష్యంతో పాటు, వరి పంటకు మేలుచేసే మిత్ర పురుగులు మరణించి పంట దిగుబడి తగ్గుతుందన్నారు. కాల్చిన వేడితో భూమి సారాన్ని కోల్పోయి, తేమశాతం ఆవిరై పోతుందన్నారు.నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గి దిగుబడి తగ్గుతుందన్నారు. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు కల్లాల దగ్గరే ఉంటే ధాన్యం కూడా కాలిపోయే ప్రమాదం ఉంటుందన్నారు.

వెంకటాద్రి చెరువు కాలుష్యమయం

- చెరువులో కలుస్తున్న మురుగునీరు
- మృత్యువాత పడుతున్న చేపలు
- పట్టించుకోని అధికారులు



వెంకటాద్రి చెరువు

రేగొండ : మండల కేంద్రంలోని వెంకటాద్రి చెరువు కాలుష్యమయంగా మారింది. ఒకప్పుడు తాగు, సాగునీరుకు ఉపయోగపడిన చెరువు నేడు దుర్గంధంతో నీరు కలుషితమైంది. పదేళ్లుగా నీటితో కళకళలాడుతున్న చెరువు కింద ఆయకట్టు సస్యశ్యామలం అవుతుండగా కాలుష్యంతో మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. చేపలు, ఇతర జలచరాలు కాలుష్యానికి మృత్యువాత పడుతున్నాయి.

భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం

చెరువులో చేరుతున్న కలుషిత నీటితో రానున్న రోజుల్లో భూగర్భజలాలు కలుషితమయ్యే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కలుషిత నీటిని పంటలకు పెట్టలేని పరిస్థితి. సాగుకు ఏ మాత్రం పనికి రాకుండా పోతుందని వాపోతున్నారు. రానురాను బోర్లలో వచ్చే నీటితో వ్యవసాయం కూడా చేయలేని పరిస్థితి నెలకొంటుందని రైతులు భయపడుతున్నారు. కలుషిత నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మత్స్యకారులు, రైతుల ఆవేదన..

కాలుష్యంగా మారిన వెంకటాద్రి చెరువులోని నీరు దుర్గంధం వెదజల్లడంతో మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. కాలుష్యానికి చేపలు, రొయ్యలు, తాబేళ్లు, వివిధ రకాల పక్షులు మృత్యువాత పడుతున్నాయి. దోమలు, పురుగులతో చుట్టుపక్కల ప్రజలు రోగాలబారిన పడుతున్నారు.

దుర్వాసన వస్తోంది

వెంకటాద్రి చెరువులోకి మురుగు కాల్వ నీరు వెళ్తుంది. దీంతో నీరంతా కలుషితమై దుర్వాసన వస్తుంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. డ్రెయినేజీ నీరు కలువకుండా చర్యలు తీసుకోవాలి.

\- కోలెపాక నర్సమ్మ

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

చెరువులోకి మురుగు కాల్వవల్లోని నీరు కలువకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నీటి కాలుష్యంతో రైతులు, మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు.

\- చంద్రశేఖర్, ఏఈఈ, ఇరిగేషన్

చెరువులను కాపాడాలి



వెంకటాద్రి చెరువులో నీరు పూర్తిగా కలుషితమైంది. డ్రెయినేజీ నుంచి వెలువడే కలుషిత నీరు చెరువులోకి రాకుండా చర్యలు తీసుకోవాలి. అధికారులు చర్యలు తీసుకోకుంటే భవిష్యత్‌లో మరింత నష్టం జరుగుతుంది.

\- పసుల వినయ్

పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు



ప్రశంస పత్రాలు అందుకున్న విద్యార్థులు

భూపాలపల్లి అర్బన్: పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ బహుమతి ప్రదానోత్సవం, ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలు పోటీతత్వంతో చదవాలని, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని సూచించారు. చిన్నతనంలోనే ఏదైనా లక్ష్యాన్ని ఎంచుకొని దానికి తగిన విధంగా చదువుకోవాలని అన్నారు. విద్యాసంస్థల్లో పాఠ్యపుస్తకాలు మాత్రమే ఉంటాయని, గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు ఉంటాయన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకునేందుకు కావాల్సిన సమాచారాన్ని పొంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. పుస్తక పఠనంతోనే విజ్ఞానం, మనోవికాసం ఉంటుందన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి, కస్తూర్బాగాంధీ స్పెషల్ ఆఫీసర్ ఈశ్వరి, ఉపాధ్యాయులు నిఖిలేశ్వర్‌రెడ్డి, శేఖర్, క్రాంతికుమార్, గ్రంథాలయాల సిబ్బంది చంద్రమౌళి, రవీందర్, రాకేశ్, మంజుల పాల్గొన్నారు.

'నారాయణరెడ్డి వ్యాఖ్యలు అవాస్తవం'

కాటారం: బీజేపీ నాయకుడు చల్ల నారాయణరెడ్డి మతిభ్రమించి సోషల్ మీడియాలో అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండల కేంద్రానికి చెందిన సువిద్య పాఠశాల కరస్పాండెంట్ కొట్టె శ్రీశైలం అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో పుట్ట మధుపై శ్రీధర్‌బాబు, శ్రీనుబాబు హత్యకు కుట్ర చేశారని దాని కోసం సువిద్య స్కూల్‌కు చెందిన బస్సును వాడుకున్నారని, అందులో 40 మందిని ఎక్కించుకున్నామని నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు అసత్యం అన్నారు. తాను ఎప్పుడు తన పాఠశాలకు సంబంధించిన బస్సును నారాయణరెడ్డికి కానీ కాంగ్రెస్ నాయకులకు కానీ, పార్టీ అవసరాలకు కానీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. వ్యక్తిగత కక్షలతో తనపై నిరాధారణమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. నారాయణరెడ్డి అసత్యపు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని లేకుంటే పురువు నష్టం దావా వేస్తానని శ్రీశైలం హెచ్చరించారు. ప్రజా అభివృద్ధి, సంక్షేమం కోసం శ్రమిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, శ్రీనుబాబుపై నిరాధారణమైన ఆరోపణలు చేస్తే ప్రజలు సహించరని పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీల పేరుతో ఆగం చేసిండ్లు

- ఏడాది కావొస్తున్నా అమలుచేయని కాంగ్రెస్
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో చేసిన ప్రచార కార్డును ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

పలిమెల : సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, పాలకులవి దొంగ మాటలేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజావంచన దినోత్సవాల్లో భాగంగా బుధవారం పలిమెలలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామంటూ ఇంటింటికి తిరిగి సంతకాలు పెట్టి మరీ ప్రచారం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను ఆగం చేశారన్నారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసి అధికారం అప్పగిస్తే వాళ్లను దగా చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉన్న మంథని ఎమ్మెల్యే, మంత్రి శ్రీధర్‌బాబు పథకాల అమలులో విఫలమయ్యారన్నారు. ఆనాడు కేవలం అధికారం, పదవుల కోసమే చూశారే తప్ప పేద ప్రజల సంక్షేమంపై ఆలోచన చేయడం లేదన్నారు. కాంగ్రెస్ అంటేనే మోసం అబద్ధాలు అని అనానరు. తెలంగాణాలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామంటూ మహారాష్ట్రలో ప్రచారం చేస్తున్నారని, ఇక్కడి తరహాలోనే మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం దిగివచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని పుట్ట మధుకర్ డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌లో చేరిక

బీఎస్పీ మండల అధ్యక్షుడు కలుగూరి వెంకటయ్య బుధవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వెంకటయ్యకు పార్టీ కండువా కప్పి పుట్ట మధుకర్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి, యూత్ అధ్యక్షుడు లంగారి రవీందర్, నాయకులు తిరుపతి, రాజబాపు దుర్గారావు, సూరిబాబు, రామ్మూర్తి, నారాయణ, సమ్మిరెడ్డి పోచమల్లు బాలు, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేవానాయక్ సేవలు ఎనలేనివి



దేవానాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కాటారం: మహాముత్తారం మండల విద్యాధికారిగా సుదీర్ఘకాలం పని చేసిన అజ్మీరా దేవానాయక్ సేవలు మరువలేనివని ఎంఈఓ పాశం సంజీవరెడ్డి అన్నారు. బదిలీపై భూపాలపల్లికి వెళ్లిన దేవానాయక్ వీడ్కోలు కార్యక్రమం బుధవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం కార్యాలయంలో నిర్వహించారు. పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు దేవానాయక్‌ను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా మహాముత్తారం మండలంలో విధులు నిర్వర్తించి అందరి మన్ననలను పొందిన వ్యక్తి దేవానాయక్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు అజ్మీరా రవీందర్, తిరుపతి, అనిల్‌నాయక్, రఘుపతిరెడ్డి, కామిడి సతీశ్‌రెడ్డి, బుచ్చి రాములు, విజయ్, దీపక్, రోజా, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా రవీందర్ సింగ్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న నాయకులు

కాళేశ్వరం: కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్దార్ రవీందర్‌సింగ్ గెలుపు ఖాయమని శాతవాహన జేఏసీ వ్యవస్థాపకుడు చెన్నమల్ల చైతన్య అన్నారు. ఆయన బుధవారం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఆయన గెలుపుకోసం అభిషేకం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆయనను గెలిపించుకోవాలని గడపగడపకు వెళ్లి ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి మెరుగు శేఖర్, మాజీ ఎంపీటీసీ ఆరే బాపు, నాయకులు నైతం లక్ష్మణ్, నైతం మహేష్, పొట్పాల సుధీర్, సాయి పవన్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



కొనుగోలు కేంద్రంలో పరిశీలిస్తున్న ప్రభాకర్

మొగుళ్లపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని పౌరసరఫరాల శాఖ టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంతోపాటు, ముల్కలపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టాస్క్‌పోర్స్ ఎస్సై కృష్ణ, జంగయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారులు శ్రవణ్ రెడ్డి, గంగాధరి రాజు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింగరావు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ మణిదీప్

టేకుమట్ల: విద్యుత్ మోటార్ల వద్ద రైతులు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ ఏఈ మణిదీప్ సూచించారు. బుధవారం మండలంలోని పంగిడిపల్లిలో ఆపరేషన్ విజన్–భూపాలపల్లి టేకుమట్ల సెక్షన్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ–పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు కెపాసిటర్లపై అవగాహన కల్పించారు. విద్యుత్ మోటార్ల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవడంతో మోటార్లకు హెచ్చుతగ్గులు లేకుండా అందుతుందని, అంతే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌కు లోడింగ్ సమస్య తలెత్తకుండా ఉంటుందని అన్నారు. ఆయన వెంట లైన్‌మెన్ రఘు, కిరణ్, రైతులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

టేకుమట్ల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ మల్లన్న అన్నారు. బుధవారం ఎస్సై గోగికారి ప్రసాద్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు సెల్‌లకు మెసేజ్‌లను, లింక్‌లు పంపిస్తూ బ్యాంకుల నుంచి కాల్ చేస్తున్నామంటూ ఓటీపీలు చెప్పాలంటూ మాట్లాడుతారని అలాంటి వారిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి ఓటీపీలు చెప్తే మన ఖాతా నుంచి నగదును చోరీ చేస్తారని చెప్పారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి నగదు కోల్పోతే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. కానిస్టేబుల్ సుమన్, టీజీఎస్పీ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కళ్ల గంతలతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్ : పెండింగ్ స్కాలర్ షిపులను విడుదల చేయాలని డి మాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు బకాయిలను విడుదల చేస్తామని, విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని, విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జోసెఫ్, శివ, పవన్, సురేష్, ప్రశాంత్, నవీన్, కార్తీక్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



రేగొండ : కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే సత్యనారాయణ రావు



కాటారం : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్, చైర్మన్

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని చిన్నకోడేపాక, విజ్జయ్యపల్లి, రాజక్కపల్లి, కొత్తపల్లిగోరి, నిజాంపల్లి, సుల్తాన్‌పూర్, వెంకటేశ్వర్లపల్లి, జగ్గయ్యపేట, రేగొండ, రంగయ్యపల్లి, రేపాక, రేపాకపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొత్తపల్లిగోరిలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీసీఓ బాల్యానాయక్, తహసీల్దార్ వీరభ్రం, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు సంపత్‌రావు, ఓంప్రకాష్, పున్నం రవి, వీరబ్రహ్మం, పట్టెం శంకర్, తిరుపతి, మహిపాల్, రవీందర్, భిక్షపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేటలో బుధవారం ఎమ్మెల్యే సత్యనారాయణరావు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్త, పాత వర్గ విభేదాలు తారాస్థాయికి చేరాయి. కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ సమయంలో కొబ్బరికాయలు కొట్టే సందర్భంలో ఇరువర్గాల వ్యక్తులకు గొడవ మొదలైంది. ఎమ్మెల్యే వెళ్లిన అనంతరం ఒకరినొకరు తిట్టుకుంటూ దూషణకు దిగడంతో గొడవ వాతావరణం నెలకొంది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి వర్గ విభేదాలు రెండు వర్గాలుగా కాంగ్రెస్ వ్యవహరిస్తే భారీగా నష్టం జరుగుతుందని కార్యకర్తలు వాపోతున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

టేకుమట్ల : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెయింగ్ మిషన్‌లో ధాన్యం బస్తాను వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన సన్నాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధరతో పాటు బోనస్ రూ.500లను రైతుల ఖాతాల్లో జమచేస్తారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే తూకం వేయాలన్నారు. అలాగే ట్రాన్స్‌పోర్ట్‌లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పటిష్ఠంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ రఫీ, ఎంపీడీఓ అనిత, జిల్లా నాయకులు కత్తి సంపత్, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ కొలుగూరి అనిల్, మార్కెట్ డైరెక్టర్ లింగంపెల్లి కిరణ్‌రావు, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

కాటారం : మహాముత్తారం మండలం కోనంపేట, మీనాజీపేట, కిష్టాపూర్ గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సోమ శాంతకుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యంకు మద్దతు ధర అందుతుందని తెలిపారు. ఏఓ అనూష, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అనిల్‌రెడ్డి, సెంటర్ ఇన్‌చార్జ్‌లు, రైతుల పాల్గొన్నారు.

'అభివృద్ధిని ఓర్వలేకనే హైడ్రామా'

కాళేశ్వరం: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంథని నియోజకవర్గం, రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే ఆయనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మహదేవపూర్ మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాడుగుల పవన్‌శర్మ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పుట్ట మధుకు బినామీగా ఉన్న చల్లా నారాయణరెడ్డిలు ఇద్దరు కలిసి హైడ్రామా చేస్తున్నారని విమర్శించారు. నారాయణరెడ్డి ఎమ్మెల్యే టికెట్ కోసం పార్టీలు మారుతూ అన్ని పార్టీల రాష్ట్ర నాయకుల ముందు మోకరిల్లారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మంథనిలో లాయర్ దంపతుల హత్య జరిగితే ఆ ఇద్దరు నాయకులు ఎందుకు స్పందించలేదన్నారు. ఇప్పటికై నా తమ నాయకుడు శ్రీధర్ బాబుపై లేనిపోని ఆరోపణలు చేసి అభివృద్ధిని అడ్డుకోవాలని చూసేవారిని నియోజకవర్గంలో తిరగనివ్వమని అన్నారు.